సాక్షి
ప్రకాశం
బుధవారం । 14 । మే । 2025



గౌరవం పాయే..

మార్కాపురం మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కోసం కూటమి నాయకులు ఆడిన డ్రామాలో వైఎస్సార్ సీపీని వీడిన కౌన్సిలర్లు బలిపశువుల్లా మారారనే చర్చ జోరుగా నడుస్తోంది. - 8లో..

కిడ్నాప్ కథ సుఖాంతం



ఆరు నెలల పసికందు కిడ్నాప్ కథ సుఖాంతమైంది. పోలీసులు రెండు గంటల్లోనే నిందితురాలిని పట్టుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
41 /29

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి

ఒంగోలు టౌన్: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీ నాయక్‌కు ఒంగోలు ఎలక్ట్రానిక్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. నగరంలోని బాపూజీ కాంప్లెక్స్‌లో మంగళవారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. దేశ యువతకు మురళీ నాయక్ త్యాగం స్ఫూర్తిగా నిలుస్తుందని వక్తలు కొనియాడారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, అసోసియేషన్ ప్రసిడెంట్ నరసింహరాజు, కార్యదర్శి చిరంజీవి, సహాయ కార్యదర్శి జైరాజు , ఉన్నం హరిబాబు, బోడపాటి శ్రీనివాసరావు, మోడ్రన్ వెంకటేశ్వరరావు, అనిల్ బాబు,బిపిఎల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ లైబ్రరీపై అవగాహన ప్రదర్శన



అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం

ఒంగోలు వన్‌టౌన్: ఉర్దూ లైబ్రరీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఒంగోలు ఇస్లాంపేటలో మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి పార్థసారధి మాట్లాడుతూ ఉర్దూ భాషను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండో అధికార భాషగా గుర్తించిందన్నారు. ఉర్దూ లైబ్రరీని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమాన్ని ఉర్దూ లైబ్రేరియన్ పఠాన్ తాహెరున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సిబ్బంది సుధాకర్, అంకమ్మరావు, అశోక్, స్థానిక ముస్లిం సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

2026 జూలైకి వెలిగొండ నీళ్లు విడుదల

- జలవనరుల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: వెలిగొండ ప్రాజెక్టు నుంచి 2026 జూలైలో నీళ్ల విడుదలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఎం .వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కొండ మీద ఉన్న ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్టు అధికారులు, ఆ శాఖ కార్యదర్శి జి.సాయి ప్రసాదు, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాలో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది జూలైలో స్టేజ్-1 కింద సాగు నీరు ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా శ్రీశైలం ఎగువ జలాలను రెండు టన్నెళ్ల నుంచి ఫీడర్ ఛానల్ ద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్‌ను నింపేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అందుకుగాను స్టేజ్-1 పరిధిలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. తీగలేరు, గొట్టిపడియ ఛానళ్ల ద్వారా స్టేజ్- 1 కింద నీరిచ్చే విధంగా పనులు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీలను పరిష్కరించాలని, అందుకు సంబంధించి రెవెన్యూ అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఇంకా మిగిలి ఉన్న భూముల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ జిల్లా సీఈ బి.శ్యాం ప్రసాదు, ఎస్ఈ సి.నాగమురళీ మోహన్, డీఎస్ఈ హరి కిషన్ రాజ్, మార్కాపురం ఈఈ అబుతలేం, జలవనరుల శాఖ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, జేఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యకు తగిన పరిష్కారం చూపాలి



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ

ఒంగోలు సబర్బన్: అధికారులు అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యకు తగిన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. కలెక్టరేట్‌లోని మీ కోసం సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించి ప్రత్యేక చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కార ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పార్థసారధి, వరకుమార్, కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మృత్యు దారిలో.. ముగిసిన ప్రయాణం

కలిసి ఏడడుగులు నడిచారు. ధర్మేచ అర్థేచ కామేచ అంటూ పెళ్లి నాటి ప్రమాణాలను పాటించారు. కష్ట సుఖాలలో తోడు నీడగా మెలిగారు. పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలని కలలు కన్నారు. అందుకోసం చేయి చేయి కలిపి ముందుకు కదిలారు. ఈ అన్యోన్య దంపతులను చూసి విధికి కన్నుకుట్టినట్టుంది. కడదాకా నడవక ముందే కర్కషంగా కాటేసింది. కడుపు చేతపట్టుకొని కూలి పనుల కోసం సుదూర ప్రాంతాలకు బయలు దేరిన వారిని మృత్యువు వెంటాడింది. కన్న బిడ్డలకు అమ్మా నాన్నలను లేకుండా చేసింది. ఇప్పుడు గడ్డమీదపల్లి గుండె పగిలింది. ఊరు వాడా ఏకమై గుక్కపట్టి రోదిస్తోంది. ఏ వీధి చూసినా అంతులేని విషాదంతో కన్నీరు పెడుతోంది.



సంఘటన స్థలంలో నుజ్జునుజ్జయిన వాహనాలు

- రోడ్డు ప్రమాదంలోనూ వీడని దాంపత్య బంధాలు
- బొలెరో వాహన్ని కొబ్బరి బొండాల లారీ ఢీకొట్టిన ఘటనలో నలుగురు దుర్మరణం
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ఒక్కొక్కరిదీ ఒక్కో దీన గాథ..
- తల్లిదండ్రుల కోసం చిన్నారుల ఎదురుచూపులు
- రోదిస్తున్న గడ్డమీదిపల్లె... మిన్నంటిన విషాదం

యర్రగొండపాలెం:

పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఈపూరు గ్రామంలో బొప్పాయి కాయలు కోసేందుకు మంగళవారం ఉదయం యర్రగొండపాలెం మండలంలోని గడ్డమీదిపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి దంపతులు, జొన్నగిరి రామాంజీ దంపతులు, మరికొందరు బొలేరో వాహనంలో బయలుదేరారు. గడ్డమీదిపల్లె గ్రామం నుంచి బయలుదేరిన గంటలోపే వినుకొండ మండలం శివాపురం సమీపంలోని జాతీయ రహదారిపై వీరు వెళుతున్న వాహనాన్ని ఎదురుగా కొబ్బరి బోండాలతో వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పగడాల రమణారెడ్డి(45), ఆయన భార్య సుబ్బమ్మ(40), జొన్నగిరి రామాంజీ (35), ఆయన భార్య అంకమ్మ(28) అక్కడికక్కడే మృతి చెందారు. బొలెరో వాహనం డ్రైవర్ కదిరి నాగేశ్వరరావు, కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ ప్రమాద విషయం తెలియగానే రెండు కుటుంబాలతో పాటు ఆ గ్రామమంతా తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఇప్పుడే అందరినీ పలకరించి వెళ్లిన వారు తిరిగి తమ గ్రామంలోకి రారన్న చేదు నిజాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. ఘటనా ప్రాంతానికి గ్రామం మొత్తం కదలి వెళ్లి కన్నీరు మున్నీరయ్యారు. ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డవారు, క్షతగ్రాతులది ఒక్కొక్కరిది ఒక్కో దీన గాథ..

భవిష్యత్ ఎలా..

తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న బొలెరో డ్రైవర్ కదిరి నాగేశ్వరరావు కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమే. తనకు తెలిసిన పని మోటార్ ఫీల్డ్ కావడంతో ఆయన బొలెరోను కొనుగోలు చేసుకొని జీవిస్తున్నాడు. తల్లికి కళ్లు కనపడవు, ఇద్దరు అక్కలు మూగవారు. వారి ఆలనాపాలన అంతా నాగేశ్వరరావు చూసుకునేవాడని, ప్రమాదంలో రెండు కాళ్లు పూర్తిగా విరిగిపోయాయని, ఇప్పుడు ఆ కుటుంబానికి దిక్కెవరని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో బాధితురాలు నాగమణిది మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామం. కొన్ని కారణాలతో ఇటీవల కాలంలో ఆమె గడ్డమీదిపల్లెకు చేరింది. అక్కడే ఉండి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆ గ్రామానికి చెందిన మరో బాధితురాలు పగడాల శివమ్మ కూలి పనులు చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తుందని ఆ గ్రామస్తులు తెలిపారు.



పగడాల సుబ్బమ్మ



పగడాల రమణారెడ్డి



జొన్నగిరి రామాంజి



జొన్నగిరి అంకమ్మ

మరణంలోనూ వీడని తోడు..



పగడాల రమణారెడ్డి దంపతులు(ఫైల్)

దాంపత్య బంధాలు జీవిత కాలం ఉంటాయనడానికి గడ్డమీదిపల్లె వాసులు నిరూపించారు. కలిసి జీవించడం, కలిసి మరణించడంలో కూడా వారు ముందున్నారు. రోడ్డు ప్రమాదంలో విగత జీవులుగా మారారు పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ, జొన్నగిరి రామాంజి, అంకమ్మ దంపతులు. పనికి పోయి వస్తామంటూ కన్నబిడ్డలకు, కుటుంబ సభ్యులకు, ఇంటి పక్కన వాళ్లకు చెప్పి బయలుదేరిన గంట వ్యవధిలో మృత్యువాత పడటం ఆ ఊరిని కుదిపేసింది.



వివాహం నాటి జొన్నగిరి రామాంజి, అంకమ్మ దంపతులు(ఫైల్)



మృతులు రమణారెడ్డి, సుబ్బమ్మల ఇంటివద్ద విషాదంలో మునిగిన గ్రామస్తులు



తండాకు తీసుకొచ్చిన రామాంజి, అంకమ్మ మృతదేహాలు

పాపం పసివాళ్లు



తల్లిదండ్రుల కోసం ఎదురు చూస్తున్న చిన్నారులు

రామాంజి పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలంలోని దావుపల్లి గ్రామానికి చెందినవాడు. దాదాపు 11 ఏళ్ల క్రితం గడ్డమీదివల్లెకు చెందిన అంకమ్మను వివాహం చేసుకున్నాడు. వీరికి యూకేజీ చదువుతున్న పవన్‌కుమార్, ఈ విద్యా సంవత్సరంలో ఎల్‌కేజీలో చేరేందుకు సిద్ధమవుతున్న నాగచైతన్య సంతానం. దాచేపల్లిలో చేసుకోవడానికి పనులు లేకపోవడంతో పాటు బొప్పాయి కోతలకు వెళ్తే కూలి ఎక్కువగా వస్తాయన్న ఆశతో ఆ కుటుంబం నెల రోజుల క్రితం గడ్డమీది పల్లెకు చేరింది. అత్తవారింట్లో ఉంటూ రామాంజి తన భార్యతో కలిసి పనులకు వెళ్లేవాడు. పనికి వెళ్లిన తల్లిదండ్రుల కోసం ఆ చిన్నారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రోడ్డు ప్రమాదం వారిని కబళించిందని, వారు ఇక రారు..ఇక వారి ఆలనా పాలనా ఉండదు అన్న విషయాన్ని ఆ చిన్నారులకు ఎలా చెప్పాలో తెలియక బంధువులు, గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇంకా ఊహ కూడా రాకముందే పిల్లలు అనాథలుగా మారారని, ఇక వారికి దిక్కెవరంటూ బంధువులు పెద్ద పెట్టున రోదించారు. వీరికి ఎవ్వరూ బంధువులు లేకపోవడంతో తాతయ్య వృద్ధుడు కావటంతో వీరి భవిష్యత్ ఏమవుతుందోనని తండావాసులు చర్చించుకుంటున్నారు.

పిల్లల భవిష్యత్ కోసమని..



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న పగడాల రమణారెడ్డి కుమార్తెలు, కుమారుడు

గడ్డమీదిపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్దకుమార్తెకు వివాహం చేశారు. మిగిలిన ఇద్దరిలో కుమారుడు వెంకటరెడ్డి మార్కాపురంలోని ఒక కళాశాలలో బీఫాం చదువుతున్నాడు. కుమార్తె నవిత ఇంటర్ పూర్తిచేసుకొని ఉన్నత చదువుల కోసం సిద్ధమవుతోంది. తాము కూలీ పనులు చేసుకుంటున్నా తమ పిల్లలు మంచి చదువులు చదవాలన్న ఉద్దేశంతో వారిని పనులకు దూరంగా ఉంచి వారు కాయకష్టం చేసుకుంటున్నారు. ప్రమాదం జరిగిన మూడు గంటల తర్వాత ఆసుపత్రి వద్దకు చేరుకున్న కుమార్తెలు, కుమారుడు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ, కష్టపడుతూ తమకు కష్టం తెలియకుండా చూసుకునే తమ తల్లిదండ్రులు ఇలా విగతజీవులుగా మారతారని తాము కలలో సైతం ఊహించలేదంటూ వారు పెట్టే రోదనలు అస్పత్రిలో మిన్నంటాయి.

దావుపల్లి తండాలో విషాదఛాయలు

పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం దావుపల్లితండాకు చెందిన జొన్నగిరి రామాంజీ దంపతులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారన్న విషయం తెలుసుకున్న తండావాసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని వీరి మృతదేహాలను దావుపల్లితండాకు తీసుకొచ్చారు. మృతదేహాలు తండాలోకి రాగానే ఒక్కసారిగా రోదనలతో దద్దరిల్లింది. తల్లిదండ్రులు చనిపోయిన విషయం తెలియగానే పవన్‌కుమార్ రోదిస్తుండగా.. చైతన్య దిక్కులు చూస్తున్నాడు.

టీచర్ల బదిలీలకు రంగం సిద్ధం

- మా సూచనలు పరిగణలోనికి తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్



ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. బదిలీల నోటిఫికేషన్ బుధవారం వెలువడనున్నట్లు సమాచారం . అయితే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, జీఓ 117 రద్దు మార్గదర్శకాల విడుదలకు సంబంధించి తాము ఇచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వం, విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

అంతా ఆన్‌లైన్‌లోనే..

బదిలీలను ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రాతిపదికన నిర్వహించనున్నారు. బదిలీల దరఖాస్తు విధానం, స్థానాల ఎంపిక, కేటాయింపు ప్రక్రియ మొత్తం కూడా ఆన్‌లైన్‌లో జరగనుంది. గత ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపట్టలేదు. దీంతో రెండేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి మే 31వ తేదీ వరకు విద్యాసంవత్సరాన్ని ప్రాతిపదికన తీసుకోనున్నారు. వీటికి సంబంధించి ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు కనీస సర్వీసు రెండేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వరకు తీసుకోనున్నారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్లుగా నిర్ణయించారు.

ఖాళీ వివరాలన్నీ డిస్‌ప్లేలో..

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులకు సంబంధించి బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు డిస్‌ప్లే చేస్తారు. 2025 మే నెలాఖరు వరకు ఉన్న ఖాళీలన్నింటినీ బదిలీల్లో చూపుతారు. 2020 మే 31కు ముందు పాఠశాలల్లో చేరిన ప్రధానోపాధ్యాయులకు ఐదేళ్లు, అదే పాఠశాలల్లో విద్యా సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. 2017 మే 31కి ముందు పాఠశాలల్లో చేరిన ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు ఎనిమిది సంవత్సరాలు పూర్తవుతున్నందున తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. 2027 మే నెలాఖరు లోగా ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులకు ఎనిమిదేళ్ల పూర్తయితే బదిలీ ఉంటుంది. ఎనిమిదేళ్లు పూర్తికాకపోతే బదిలీల నుంచి మినహాయింపు అవకాశం ఉంది. జిల్లాలో ఎంపీపీ, జెడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో 11,200 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇందులో తప్పనిసరి బదిలీలకు సంబంధించి ఎనిమిది సంవత్సరాలు పూర్తయినవారు, మిగులు ఉపాధ్యాయులు 5,255 మంది దాకా ఉండవచ్చని సమాచారం. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

ఉపాధ్యాయ సంఘాల సూచనలు

- బదిలీల జీఓ తక్షణమే విడుదల చేసి వేసవి సెలవుల్లోగా ప్రక్రియ పూర్తి చేయాలి
- బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్ టూ హైస్కూల్స్‌లో ఇంటర్మీడియెట్ తరగతులు బోధించేందుకు అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలి
- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టాలి
- స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు బదిలీల్లో కొత్తగా మంజూరు చేసిన పోస్టులు ఖాళీలుగా చూపాలి

ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు..

- జిల్లాలో ప్రమోషన్ సీనియారిటీ సమస్యలు పరిష్కరించిన తర్వాతే ప్రమోషన్స్ ప్రక్రియ చేపట్టాలి.
- మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రేడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి ప్రమోషన్లు ఇవ్వాలి.
- స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజస్) పోస్టుల్లో హైకోర్టు తీర్పు అమలు చేసిన తర్వాత మిగిలిన పోస్టుల్లో లాంగ్వేజ్ పండిట్లు లభ్యం కానప్పుడు అర్హులైన ఎస్జీటీలకు ప్రమోషన్ ఇవ్వాలి. స్కూల్ అసిస్టెంట్(ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టుల్లో కూడా అర్హులైన ఎస్జీటీలకు ప్రమోషన్ ఇవ్వాలి.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలనే ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోలేదు. స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెడ్మాస్టర్‌గా నియమిస్తామనడం సరికాదు. అధిక సంఖ్యలో ఉండే ఎస్జీటీ ఉపాధ్యాయులకైనా మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలి. బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్-2 ఉన్నత పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలి. ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించి అదనంగా పోస్టులను కేటాయించాలి. ప్రభుత్వ విధానాలు విద్యారంగానికి ఉపయోగపడేలా ఉండాలే తప్ప నష్టం కలిగించే విధంగా ఉండకూడదు.

– కొమ్మోజు శ్రీనివాసరావు, యుటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు

కూలీల వలసలు నివారించాలి



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

- వినుకొండ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: తీవ్ర కరువు, కాటకాలతో అలమటిస్తున్న పశ్చిమ ప్రాంత ప్రజలు కూలి పనుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని, ఈ ప్రయాణంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు వదలుతున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గడ్డమీదిపల్లె గ్రామానికి చెందిన కూలీలు బొప్పాయి కోతల కోసం వెళ్తు పల్నాడు జిల్లా వినుకొండ మండలం శివాపురం గ్రామానికి సమీపంలోని హైవే రోడ్డుపై జరిగిన ప్రమాదంలో నలుగురు కూలీలు మరణించారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే మంగళవారం ఆయన గడ్డమీదిపల్లెకు వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతులకు పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారని, ఈ కారణాలతో వందల ఎకరాలు ఉన్న రైతులు సైతం కూలి పనులు చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులు కూడా సక్రమంగా జరగడం లేదని, ఆ నిధులను కూడా కూటమి నాయకులు మెక్కేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. పనులు కల్పించకపోవడంతోనే గడ్డమీదిపల్లెకు చెందిన 300 కుటుంబాలు వలసలు వెళ్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థవుతుందన్నారు. మృతుల కుటుంబాలను పరిశీలిస్తే కూలీ పనుల కోసం దూర ప్రాంతాలకు ఎందుకు వెళ్తున్నారనే విషయం అర్థం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం యర్రగొండపాలెం మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించకపోవడం వల్లే వలసలు వెళ్లక తప్పడం లేదన్నారు. వలసలు నివారించాలంటే వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి, ప్రాజెక్ట్‌కు నీళ్లు వదలడమే సరైన మార్గమన్నారు. ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు భారీ ఎత్తున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆహ్వానం మన్నించండి.. పెళ్లి చేసుకోండి..!



కల్యాణ మండపానికి వెళ్లే ప్రధాన రోడ్డు



గోడలకు నెర్రెలు

- ఆదరణకు నోచుకోని గిద్దలూరు టీటీడీ కల్యాణ మండపం
- వినిపించని కల్యాణ మంత్రాలు.. మోగని బాజాలు
- ప్రారంభించి ఏడేళ్లు.. జరిగింది రెండే పెళ్లిళ్లు!

గిద్దలూరు రూరల్: జీవితంలో ఓ మధురమైన ఘట్టం కల్యాణం. సంతోషంగా పెళ్లి చేసుకోవాలని భావించే పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తూ గిద్దలూరు పట్టణంలో టీటీడీ నిర్మించిన కల్యాణ మండపం నిరుపయోగంగా మారింది. కల్యాణ ఘడియలు సమీపించిన వధూవరుల రాక కోసం ఎదురు చూస్తోంది.! వివరాల్లోకి వెళ్తే.. గిద్దలూరు కోర్టు భవనం సమీపంలో సుమారు ఎకరా విస్తీర్ణంలో టీడీడీ కల్యాణ మండపం నిర్మించింది. 2018లో ప్రారంభించిన ఈ మండపంలో వధువు, వరుడు ఉండేందుకు ప్రత్యేక గదులు, ప్రహరీ, వంటశాల, మరుగుదొడ్లు, సీసీ రోడ్డు, భోజనశాల తదితర సౌకర్యాలన్నీ కల్పించారు. అంతా బాగానే ఉంది కానీ ఇక్కడ పెళ్లి చేసుకునేవారే కరువయ్యారు. గడిచిన ఏడేళ్లలో కనీసం ఏడు వివాహాలు కూడా ఇక్కడ జరగలేదంటే పరిస్థితి ఏమిటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కల్యాణ మంత్రాలు, మంగళవాయిద్యాలు వినిపించని కల్యాణ మండపంగా పేరు తెచ్చుకుంది. మండపం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు సైతం నిర్వహణలో చేతులెత్తేయడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. మండపం ఆవరణతోపాటు ప్రధాన రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగాయి. గోడలు నెర్రెలిచ్చాయి. కొందరు ఆకతాయిలు మండపం కిటికీల అద్దాలను రాళ్లతో పగలగొట్టారు. అరకొర వసతులు ఉన్న ప్రైవేట్ కల్యాణ మండపాల్లో ప్రతి సీజన్‌లో పదుల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతుంటే.. అన్ని వసతులు ఉన్న టీటీడీ మండపంలో బాజాభజంత్రీలు ఎందుకు మోగడం లేదో ఆ వెంకన్నకే ఎరుక.



నిరుపయోగంగా టీటీడీ కల్యాణ మండపం



పెళ్లి మంత్రాలు వినిపించని మండపం

కారణం ఇదేనా?

గిద్దలూరులోని కొందరు కల్యాణ మండపాల నిర్వాహకులు తమకు అయినవారిని ముందుపెట్టి టీటీడీ మండపం నిర్వహణ టెండర్ దక్కించుకుని అక్కడ వివాహాలు కాకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్యాణ మండపం పట్టణానికి దూరంగా ఉండటం వల్ల వివాహం చేసుకునేందుకు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఓ కాంట్రాక్టర్ టీటీడీ మండపం టెండర్ దక్కించుకున్నట్లు సమాచారం. ఈ ఏడాదైనా వివాహాలు జరుగుతాయో లేదో వేచి చూడాల్సిందే.



చిల్లచెట్లు పెరిగిన పార్కింగ్ స్థలం

క్లుప్తంగా

గుండెపోటుతో ఆర్మీ జవాన్ మృతి



గంజికుంట్ల మౌళి మనోహర్(ఫైల్)

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ గంజికుంట్ల మౌళిమనోహర్(40) మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు. ముంబయిలోని ఆర్మీ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన మంగళవారం ఉదయం 10:30 గంటలకు తమ క్యాంప్‌లోనే గుండెపోటుకు గురయ్యారు. తోటి జవాన్లు హుటాహుటిన ఆర్మీ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆర్మీ ఉన్నధికారుల నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మౌళిమనోహర్ మృతి విషయం తెలియడంతో భార్య వెంకటనవ్యతోపాటు కుమారుడు, కుమార్తె, బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు. జవాన్ భౌతికకాయాన్ని బుధవారం సాయంత్రం రాచర్ల గ్రామానికి తీసుకొస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎల్లమ్మ గుడిలో హుండీ చోరీ



దొంగలు పగలగొట్టిన హుండీ

హనుమంతునిపాడు: మండల కేంద్రమైన హనుమంతునిపాడులోని నాగరప్ప ఎల్లమ్మ గుడిలో హుండీని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి కానుకలు అపహరించారు. ఈ సంఘటన సోమవారం వెలుగుచూసింది. అందిన సమాచారం మేరకు.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లి గ్రామ సమీపంలోని ఊరకుంట వద్ద పగలగొట్టారు. అందులో ఉన్న రూ.5 లక్షల నగదు, 2 తులాల బంగారు వస్తువులు చోరీ చేశారు. గుడి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్‌ప్లస్ ఉర్దూ పోస్టులపై డీఈఓ స్పందించాలి



మాట్లాడుతున్న అబ్దుల్ వహీద్ ఖాన్

మార్కాపురం టౌన్: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉర్దూ పోస్టులను సర్‌ప్లస్‌లో చూపిన జిల్లా విద్యాశాఖ అధికారులు లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఉర్దూ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు పి.అబ్దుల్ వహీద్ ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సర్‌ప్లస్‌లో 40 ఎస్‌జీటీ, 9 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను జీవో ప్రకారం సర్‌ప్లస్‌లో ఎలా చూపారో తెలపాలన్నారు. యుడైస్‌లో ఉర్దూ మీడియం ఉన్నా ఇంగ్లిష్ మీడియం పెట్టమనడం, ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూళ్లలో ఉర్దూ ఎస్‌జీటీకి బదులు తెలుగు ఎస్‌జీటీని ఉంచడంపై ప్రశ్నించారు. ఉర్దూ ఒక భాషగా ఉన్న స్కూళ్లలో ఎస్‌ఏ ఉర్దూ, ఎస్‌జీటీ ఉర్దూలను ఏ జీఓ ప్రకారం తీశారని నిలదీశారు. ఉపాధ్యాయులను సర్‌ప్లస్‌గా చూపిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఉర్దూ విద్యార్థులకు ఏ విధంగా న్యాయం చేస్తారో సీఎస్‌సీ ద్వారా తమకు సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గౌరవం పాయే..

- మార్కాపురం మున్సిపాలిటీలో ఓడిన వారిదే పెత్తనం
- వైఎస్సార్ సీపీని వీడిన కౌన్సిలర్లలో అంతర్మధనం
- ఇటు గౌరవం దక్కక.. అటు ప్రాధాన్యత లేక బిక్కమొహం

మార్కాపురం:

మార్కాపురం మున్సిపాలిటీలో చైర్మన్ పదవి కోసం కూటమి నాయకులు ఆడిన డ్రామాలో వైఎస్సార్ సీపీని వీడిన కౌన్సిలర్లు బలిపశువుల్లా మారారనే చర్చ స్థానికంగా జోరుగా నడుస్తోంది. పురపాలనలో చక్రం తిప్పాలని ఆశించిన టీడీపీ నేతలంతా ఒక్కటై.. పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లకు ప్రాధాన్యం లేకుండా చేయడమే అందుకు కారణం. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మార్కాపురం మున్సిపాలిటీని దక్కించుకునేందుకు టీడీపీ నియోజకవర్గ ముఖ్యనేత పావులు కదిపారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను బుజ్జగించి, బెదిరించి ఈ ఏడాది జనవరిలో టీడీపీ కండువాలు కప్పారు. ఇంతవరకు బాగానే ఉంది కానీ ఇక్కడి నుంచే అసలు కథ మొదలైంది. వైఎస్సార్ సీపీ తరపున మంచి మెజారిటీతో గెలిచిన తమను కాదని టీడీపీ తరపున ఓడిన నాయకులు వార్డుల్లో పెత్తనం చెలాయిస్తుండటంతో ఫిరాయించిన వారిలో అంతర్మధనం మొదలైంది. కాస్తో కూస్తో గౌరవం దక్కుతుందని, ఆర్థికంగా ఇబ్బందులు తప్పుతాయని భావించి టీడీపీ కండువాలు కప్పుకొన్న నాయకులంతా తమ సన్నిహితుల వద్ద బాధ వెళ్లగక్కుతుండటం చర్చనీయాంశమైంది. కనీస గౌరవం లేకపోగా, ఆర్థికంగా దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని పార్టీ మారిన కౌన్సిలర్లు నెత్తీనోరు బాదుకుంటున్నట్లు తెలిసింది.



మార్కాపురం మున్సిపాలిటీ

పది నెలల్లో ఒరిగేదేంటి?

2021 మార్చి 10న మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. మార్కాపురంలో మొత్తం 35 వార్డులు ఉండగా 1, 10, 14, 15, 24 వార్డులు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 30 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున 30 మంది కౌన్సిలర్లు గెలుపొందగా టీడీపీ కేవలం 5 వార్డుల్లోనే పట్టు నిలబెట్టుకుంది. 2, 26, 33, 34, 35వ వార్డుల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. మిగిలిన అన్ని వార్డుల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించింది. కాగా ఇటీవల వైఎస్సార్ సీపీకి చెందిన 23వ వార్డు కౌన్సిలర్ దూదేకుల ప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కౌన్సిలర్ల సంఖ్య 34కు చేరింది. వైఎస్సార్ సీపీ నుంచి 12 మంది కౌన్సిలర్లను పార్టీ ఫిరాయించేలా చేసి అవిశ్వాస తీర్మానానికి నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. అయితే పురపాలక ఎన్నికలకు కేవలం 10 నెలలు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో ఈలోగా తమకు ఒరిగే ప్రయోజనం ఏమిటన్న భావన వైఎస్సార్ సీపీని వీడిన వారిలో ఏర్పడింది. కూటమి పక్షంలో చేరితే తమకు రాజయోగం.. వైభోగం వస్తుందని ఆశపడిన వారికి భంగపాటు తప్పలేదు. వార్డుల్లో తాము చెప్పిందే జరుగుతుందని భావించినా ఎక్కడా మాట చెల్లుబాటు కాకపోవడంతో బిక్కమొహం వేస్తున్నారు.

ఓడిన వారిదే పెత్తనం

వార్డు సచివాలయాల్లో కౌన్సిలర్లకు కనీస గౌరవం ఇవ్వకుండా టీడీపీలో ఓడిన నాయకులే పెత్తనం చెలాయిస్తున్నారు. కొత్తగా టీడీపీలో చేరిన కౌన్సిలర్లకు ఎటువంటి ప్రాధాన్యత దక్కడం లేదు. టీడీపీలో చేరి నాలుగు నెలలు గడుస్తున్నా వార్డుల్లో టీడీపీ ఇన్‌చార్జులే హవా కొనసాగిస్తుండటంతో కుతకుతలాడిపోతున్నారు. 'అనవసరంగా పార్టీ మారాం. టీడీపీలో గుర్తింపు లేదు. వార్డుల్లో ప్రజల నుంచి పలకరింపులు కూడా కరువయ్యాయి' అని టీడీపీలో చేరిన కౌన్సిలర్లు తమ సన్నిహితుల ఎదుట వాపోతున్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో తాము పోటీచేస్తే ప్రజలు ఛీకొడతారని, తమ భవిష్యత్ ఏమిటో అంతుపట్టడం లేదని మధనపడుతున్నారు.

ఆరు నెలల పసికందు కిడ్నాప్!

- రెండు గంటల్లోనే నిందితురాలి పట్టివేత
- తెల్లవారుజామున ఒంగోలు ఆర్టీసీ డిపోలో ఘటన



కుమార్తెతో తల్లి

ఒంగోలు టౌన్: తలిదండ్రులు గాఢ నిద్రలో ఉండగా వారి పక్కలోనే హాయిగా కునుకుతీస్తున్న పసికందును కిడ్నాప్ చేసిందో మహిళ. పోలీసుల కథనం ప్రకారం.. కొండపి గ్రామానికి చెందిన గుర్నాథం అంజయ్య, అంజమ్మ దంపతులు ఊరూరా తిరుగుతూ తల వెంట్రుకలు కొనుక్కోవడం, అమ్మడం చేస్తుంటారు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆ దంపతులు త్రోవగుంటలో నివసిస్తున్నారు. వారికి ఆరు నెలల పాప ఉంది. సోమవారం రాత్రి ఒంగోలు ఆర్టీసీ డిపోలో ఆ దంపతులు పాపతో కలిసి నిద్రపోయారు. మంగళవారం తెల్లవారుజామున నిద్రలేవగానే పక్కలో ఉన్న పాప కనిపించలేదు. దాంతో ఆందోళనకు గురైన ఆ దంపతులు డిపో పరిసరాల్లో వెదికారు. పాప జాడ లేకపోవడంతో డిపోలోని పోలీస్ ఔట్ పోస్టులో ఫిర్యాదు చేశారు.పోలీసులు సీసీ పుటేజ్‌ను పరిశీలించి మద్దిపాడుకు చెందిన ఇట్లా ప్రియాంకను నిందితురాలిగా గుర్తించారు. ఆమె కోసం గాలించగా జీజీహెచ్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో హుటాహుటిన వెళ్లి పాపను స్వాధీనం చేసుకున్నారు. రాత్రి విధుల్లో ఉన్న దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ, వన్‌టౌన్ సీఐ నాగరాజు చేతుల మీదుగా పాపను తలిదండ్రులకు అప్పగించారు. టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. కిడ్నాప్ అయిన పాపను రెండు గంటల వ్యవధిలోనే అప్పగించడంతో పోలీసులకు తలిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బైకులు ఢీ.. ఒకరు మృతి



వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం ఉదయం చింతగుంట్ల, తిప్పాయిపాలెం గ్రామాల మధ్య చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై అంకమరావు కథనం మేరకు.. తిప్పాయిపాలెం గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు(45) తన బైక్‌పై మార్కాపురం బయలుదేరాడు. గ్రామ శివారు దాటగానే తాడివారిపల్లి నుంచి మార్కాపురం మీదుగా కంభం వైపు బైక్‌పై వెళ్తున్న మహేష్ ఎదురుగా వస్తున్న వెంకటేశ్వర్లును ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను మార్కాపురం జీజీహెచ్‌కు తరలించగా వెంకటేశ్వర్లు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య భారతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జీవనోపాధి కోసం ఉదయాన్నే భార్యపిల్లలకు చెప్పి బయలుదేరిన వెంకటేశ్వర్లు ఊరు దాటగానే మృత్యువాత పడటంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సదరం రీవెరిఫికేషన్‌లో దివ్యాంగులకు ఇబ్బందులు

ఒంగోలు వన్‌టౌన్: సదరం ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్‌లో విభిన్న ప్రతిభావంతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముల్లా ముదార్ వలి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీ ఆర్.గోపాలకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఒంగోలు జీజీహెచ్‌లో కుర్చీలు, తాగునీరు లేక విభిన్న ప్రతిభావంతులు పడుతున్న ఇబ్బందులను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయ ఉద్యోగులు ఒక రోజు ముందు నోటీసులిచ్చి వెరిఫికేషన్‌కు వెళ్లమనడంతో సహాయకులు లేక ఒత్తిడికి గురవుతున్నారని వివరించారు. జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని జేసీని కోరారు.

పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు

- అమ్మోనియా వినియోగిస్తున్న ఫ్యాక్టరీల్లో విస్తృత తనిఖీలు
- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

ఒంగోలు సబర్బన్: ప్రమాదకర పరిశ్రమల్లో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సీహెచ్ శైలేంద్రకుమార్‌తో పాటు జిల్లాలోని క్రైసిస్ గ్రూపు ప్రభుత్వ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రమాదకర ఫ్యాక్టరీల్లో భద్రతా చర్యలకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ప్రధానంగా అమ్మోనియా వినియోగిస్తున్న ఫ్యాక్టరీల్లో రక్షణ చర్యలు ఏ విధంగా ఉన్నాయో స్వయంగా పరిశీలించాలని క్రైసిస్ గ్రూప్ అధికారులను ఆదేశించారు. నిబంధనల మేరకు ఆయా ఫ్యాక్టరీల్లో రక్షణ చర్యలు పాటిస్తున్నారా లేదా అన్న విషయాలను నిశితంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో నాలుగు హజార్డస్ ఫ్యాక్టరీలు ఉన్నాయని నెల్లూరు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తెలిపారు. సేఫ్టీ మెజర్స్‌లో భాగంగా చెరువుకొమ్ముపాలెంలోని భగీరథ ఫ్యాక్టరీలో, అమ్మోనియా వినియోగించే ఫ్యాక్టరీల్లో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. ఐస్ ప్లాంట్స్, రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్స్, మిల్క్ చిల్లింగ్ సెంటర్లలో ప్రమాదాల నివారణపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వివిధ పరిశ్రమలు సంయుక్తంగా నిర్వహించినట్లు ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో ఫైర్, పొల్యూషన్, డీఎంహెచ్‌ఓ, డీటీఓ, అగ్రికల్చర్, ఏపీపీసీబీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్

- సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్



విద్యుత్ వినియోగదారులతో మాట్లాడుతున్న అధికారులు

పొదిలి రూరల్: వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే విద్యుత్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని కన్జ్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెసల్ ఫోరం(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ పేర్కొన్నారు. మంగళవారం పొదిలిలోని మంజునాథ కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ అధికారులు బాధ్యతగా పనిచేస్తూ వినియోగదారులతో మర్యాదగా మెలగాలని సూచించారు. రెండేళ్ల కాలపరిమితిలోగా వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై 20 అర్జీలు రాగా 15 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యుత్ అదాలత్ ప్రతి జిల్లాలో నెలకోసారి ఏర్పాటు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాసరావు, ఏడీఈ హరిబాబు, 10 మండలాలకు చెందిన ఏఈలు, పలువురు వినియోగదారులు పాల్గొన్నారు.

సంద్రం.. అల్లంతదూరం!

- ఊళ్లపాలెంలో 20 మీటర్లు వెనక్కి వెళ్లిన అలలు



ఊళ్లపాలెం తీరంలో అలలు వెనక్కి వెళ్లడంతో బయటపడ్డ సిమెంట్ గట్టు

సింగరాయకొండ: సముద్రుడు దోబూచులాడుతున్నాడు. సింగరాయకొండ మండలంలోని ఊళ్లపాలెంలో అలలు తీరానికి సుమారు 20 మీటర్ల దూరం వెనక్కి వెళ్లాయి. గత కొద్ది నెలలుగా అలలు ముందుకొస్తూ రెండు అడుగల లోతు వరకు తీరం కోతకు గురైంది. దీంతో తీరంలోని విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతోపాటు రొయ్యల చెరువుల కట్టలు ధ్వంసమయ్యాయి. వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు ముందు జాగ్రత్తగా తమ బోట్లు, వలలను తీరానికి దూరంగా ఉంచారు. ఇంతలోనే అలలు 20 మీటర్ల మేర లోపలికి వెళ్లడంతో మత్స్యకారులతోపాటు పర్యాటకులు అయోమయానికి గురవుతున్నారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

- తప్పిన పెను ప్రమాదం
- ఐదుగురికి స్వల్ప గాయాలు
- ఓవర్ టేక్ చేసే క్రమంలో ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు ముందు భాగం

ఒంగోలు టౌన్/మద్దిపాడు : వేగంగా వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందున్న లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఢీకొట్టింది. ఈ సంఘటన మద్దిపాడు మండలంలోని ఏపీఐఐసీ గ్రోత్ సెంటర్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహాబలిపురం నుంచి విజయనగరం వైపు వెళ్తున్న తేజస్విని ట్రావెల్ బస్సు గ్రోత్ సెంటర్ వద్దకు రాగానే ముందున్న లారీని దాటవేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో లారీని బస్సు ఢీకొనడంతో రెండు వాహనాలు కొంత మేర దెబ్బతిన్నాయి. బస్సులోని ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదం ధాటికి బస్సులో నిద్రిస్తున్న ప్రయాణికులు ఒక్క ఉదుటన లేచి భయాందోళనకు గురయ్యారు. పెను ప్రమాదం తప్పడంతో ఊపిరిపీల్చుకున్నారు. జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మద్దిపాడు ఎస్సై శివరామయ్య తెలిపారు.